క్లుప్తంగా

బుద్ధుని మార్గంలో యువత నడవాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రపంచమంతా అహింస, జ్ఞాన దీపాన్ని వెలిగించిన గౌతమ బుద్ధుని మార్గంలో యువత నడవాలని జిల్లా పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు అన్నారు. సోమవారం బుద్ధ జయంతి సందర్భంగా పాత రిమ్స్‌లో ఉన్న గౌతమ బుద్ధ విగ్రహాన్ని పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరీం సేవా సమితి అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీ ముల్లా, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మసా కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్జీఓ' కడప నగర నూతన కమిటీ ఎన్నిక



కడప నగర నూతన కమిటీ సభ్యులతో ఎన్జీఓ అసోసియేషన్ నేతలు

కడప రూరల్ : ఏపీ ఎన్జీఓ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్జీఓ అసోసియేషన్ కార్యాలయంలో కడప నగర నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కడప నగర అధ్యక్షులుగా కే చిన్నయ్య, కార్యదర్శిగా సీ సైలేశ్వర్‌రెడ్డి, సహ అధ్యక్షులుగా జే శ్రీనివాస్, కోశాధికారిగా ఆర్‌వీ నాగార్జునరావుతో పాటు కార్యవర్గ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా యం. బాలపుల్లయ్య, సహాయ ఎన్నికల అధికారిగా పోలిరెడ్డి, పరిశీలకులుగా డీ రవికుమార్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై ప్రసాద్ యావవ్, కార్యదర్శి డీ రవికుమార్‌లు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

పౌర్ణమి పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. అందులో భాగంగా తెల్లవారుజామున పుణ్యనదీ జలాలతో నింపిన తొమ్మిది కలశాలను ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్, వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు ఆలయం చుట్టూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మంగళ వాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది దంపతులు ఇతర భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఆలయ మండపంలో 108 మంది ముత్తయిదువులతో సుమంగళిపూజ, అనంతరం యాగశాలలో చండీహోమం నిర్వహించారు. రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు.

బహుమతుల అందజేత



బహుమతులు అందిస్తున్న దూదేకుల నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ ప్రోత్సాహక బహుమతులను అందజేశామని రిటైర్డ్ డీఐజీ స్టాంప్ డిపార్టుమెంట్ అధికారి సులేమాన్, రిటైర్డ్ ఫారెస్ట్ అధికారి బాదుషా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గటూరు రాజా పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఐఎంఏ హాల్లో ఈ మేరకు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పేద విద్యార్థులను ఆదుకోవడమే తమ సంఘం లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కమల్‌బాషా, దూదేకుల నూర్‌బాష ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సుంకేసుల భాష, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేపీ హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప, గౌరవ అధ్యక్షులు బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీ వాసవాంబ మహా కుంభాభిషేకం

కడప కల్చరల్ : కడప నగరంలోని ఈ నెల 14 నుంచి 16 వరకు శ్రీ వాసవి కన్యాక పరమేశ్వరి దేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రీ భారతి తీర్థ స్వామి చేతుల మీదుగా వైభవంగా కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 14న ఉదయం 7.30 నుంచి విశేష పూజలు, నవగ్రహ వేద పారాయణం, నగరేశ్వర స్వామి, శ్రీ కోదండ రామ స్వామికి అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 నుంచి అంకురారోపణం, లక్ష కుంకుమార్చన తదితరాలు నిర్వహిస్తామన్నారు. 15న ఉదయం 7 గంటలకు శత చండీ పారాయణం, మహాలింగార్చన హోమాలు, శ్రీ వాసవి మాతకు అభిషేకాలు, వేద పారాయణ, సాయంత్రం 5.30 నుంచి లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. 16న శత చండీహోమం, మహా కుంబాభిషేకం, మహా పూర్ణాహుతి, మధ్యాహ్నం 1 గంటకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నామన్నారు.

ఘనంగా ఉత్సవం

కడప కల్చరల్ : గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం సత్యనారాయణస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుని భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు.

అధికారుల అవినీతిపై విచారణ చేపట్టాలి

కడప కార్పొరేషన్ : కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారుల తీరుపై సిట్ విచారణ చేపట్టి తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ అధికారుల తీరును నిరసిస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలువురు అధికారులు కార్పొరేషన్‌లో విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు ఇదే కార్యాలయంలో కొనసాగుతున్నారన్నారు. ఇందుకు పలువురు అధికారులు అన్ని విధాల సహాయ సహకారాలు అందించారన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన అవినీతిపై ఆధారాలతో సహా కమిషనర్, ఎమ్మెల్యేలు, జేసీ తదితరులకు నివేదిక అందజేశామన్నారు. ఈ నేపథ్యంలో 30 సంవత్సరాల నుంచి కార్పొరేషన్‌లో పనిచేస్తున్న



కార్పొరేషన్ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

అధికారులను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని, కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిపైన సిట్ వేసి విచారణ చేపట్టాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. కడపలో జరుగుతున్న మహానాడులోగా ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఆంజనేయులు, అవ్వారు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ నాయకులు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలో ఆప్కాస్‌లో ఉన్న కార్మికులందరికీ ఏప్రిల్ మాసం సంబంధించిన వేతనం మే 12 నాటికి కూడా అందలేదని, దీనిని తక్షణమే అందేలా చూడాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కేసీ బాదుల్లా, నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు సోమవారం స్పందన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఆప్కాస్, డెలీ వేజ్ కార్మికులు వేతనాలు అందక రోజువారి ఖర్చులు, పాలు, ఇంటి అద్దెలు, డ్వాక్రా గ్రూపులకు, కరెంటు బిల్లులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే వేతనాలు అందేటట్లు చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కంచుపాటి జాన్, వెంకటాద్రి, మేలంగి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని డయాగ్నొస్టిక్ సెంటర్ల పై చర్యలు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో నిబంధనల కు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ డయాగ్నస్టిక్స్ సెంటర్‌లపై చర్యలు తీసుకోవాలి డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారాల వేదికలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, బద్వేలు లాంటి ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు డయాగ్నొస్టిక్ స్కానింగ్ సెంటర్లు నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి డయాగ్నోస్టిక్ స్కానింగ్ సెంటర్లలో ఏ టెస్టుకు ఎంత ధరో ధరల పట్టిక లేవన్నారు. అంతే కాకుండా పేద ప్రజల వద్ద అధిక ధరలతో ఫీజులు వసూలు చేస్తూ కట్టిన డబ్బులకు రశీదులు కూడా ఇవ్వకుండా మోసం చేస్తున్నాయన్నారు. అర్హత కలిగిన వారు ఉద్యోగంలో లేరన్నారు. ఇదంతా తెలిసిన వైద్య శాఖ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో సంస్కరణల పేరుతో ప్రభుత్వ పాఠశాలలకు తీవ్ర నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకుంటోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 14 వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో రాష్ట్రవ్యాప్త ధర్నా చేయనున్నామన్నారు. ఉపాధ్యాయులు హాజరై ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సోమవారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో పాఠశాలకు ఒక్కో రకమైన విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించడాన్ని పూర్తిగా



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాస రెడ్డి, జిల్లా కార్యదర్శులు మునివర్ధన్ కుమార్, శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్లు క్రిష్టారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓలపై వివక్ష ఎందుకు..?



కలెక్టరేట్ వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు

కడప రూరల్ : తమపై ప్రభుత్వానికి వివక్ష ఎందుకని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)లు ప్రశ్నించారు. తమ సమస్యల పరిష్కారంలో భాగంగా వారు ఆందోళన చేపడుతున్నారు. అందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద సీహెచ్‌ఓలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ అధ్యక్షురాలు షీలాగిఫ్టీ మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి తప్పని పరిస్థితుల్లో ఏప్రెల్ 28వ తేదీ నుంచి సమ్మెలో ఉండి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు సమస్యల పరిష్కారానికి చొరవ చూపలేదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సీహెచ్‌ఓలుగా వందలాది మంది విధులను చేపడుతున్నారని అన్నారు. తామంతా కేవలం ఉద్యోగంపైనే ఆధారపడి జీవిస్తున్నామని అన్నారు. మాకు రావాల్సిన 8 నెలల ఇన్సెంటివ్‌కు గాను 6 నెలల ఇన్సెంటివ్‌ను ప్రభుత్వం మంజూరు చేయడం సంతోషమే అన్నారు. అయితే ఆ నిధులు తమ ఖాతాలో ఎప్పుడు జమ చేసేది చెప్పలేదని పేర్కొన్నారు. ఇన్సెంటివ్ అనేది తమ సర్వీసుకు సంబంధించినదని, ఆ బిల్లులనే తమకు విడుదల చేశారన్నారు. తమ ప్రధాన సమస్య నిబంధనల ప్రకారం తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా నర్సుల దినోత్సవంను నిర్వహించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హరీష్‌తో పాటు సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను పెంచే జీఓ 198ను రద్దు చేయాలి

కడప కార్పొరేషన్ : పాలకుల నిర్లక్ష్యం మూలంగా నగర పాలన పడకేస్తున్నదని, ప్రతి ఏటా 15 శాతం ఆస్తి పన్నులను పెంచే జీఓ 198ను రద్దు చేయాలని, పన్నుల రూపంలో చెల్లించే కార్పొరేషన్ జనరల్ ఫండ్‌ను మహానాడు పెయింటింగ్ పనులకు టెండర్లు పిలవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. ప్రతి సంవత్సరం 15 నుంచి 30 శాతం ఆస్తి పన్ను పెంపునకు వ్యతిరేకంగా సోమవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి కడప నగరపాలక పాలన గాడి తప్పుతోందని, కుర్చీల కుమ్ములాటలో నగరపాలక జనరల్ బాడీ సమావేశాల్లో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి, ఇప్పుడు నగర ప్రజా సమస్యలను చర్చించేందుకు సమావేశాలే జరపక పోవడం దారుణమన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా చెత్త పన్ను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా ఆస్తి పన్నులను పెంచే జీవో 198 కూడా రద్దు చేయాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పౌర సేవలన్నీ



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ఇప్పుడు వ్యాపారమవుతున్నాయన్నారు. అనంతరం స్థానిక సమస్యలపై కమిషనర్ మనోజ్ రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ, సహాయ కార్యదర్శులు కేసీ బాదుల్లా, మద్దిలేటి, నాయకులు వేణుగోపాల్, బ్రహ్మం, భాగ్యలక్ష్మి, నాగరాజు, నరసింహులు, లింగన్న, చంద్రమోహన్, శేఖర్ రెడ్డి, సుబ్బరాయుడు, మునయ్య, తిరుపాల్, కృష్ణ, ఆచారమ్మ, నిర్మలమ్మ, నాగరాజు, నారాయణ, భరత్, ఏసురత్నం, రాముడు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రధాని పట్ల అనుచిత వ్యాఖ్యలపై ఎస్పీకి ఫిర్యాదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్ర దాడిని సమర్థవంతంగా తిప్పి కొట్టిన దేశ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను కలిసి కడప నగరానికి చెందిన సంగటి మనోహర్, విజయ నరసింహ, డాక్టర్ నూరి ప్యారీ, గుజ్జల ఈశ్వరయ్యలు ప్రధాని మోదీ పట్ల అనుచితంగా వ్యాఖ్యానించారని ఫిర్యాదు చేశారు. వారిపై దేశ ద్రోహం కేసులు నమోదు చేయాలని కోరారు.

స్పోర్ట్స్ కోటాలో క్రీడల వర్గీకరణ తగదు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగాల్లో 3 శాతం ఉన్న స్పోర్ట్స్ కోటాలో మళ్లీ రెండు కేటగిరీలుగా విభజించడం తగిన నిర్ణయం కాదని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియామకాల్లో వివిధ క్రీడాంశాలను విభజించడం వల్ల అర్హులైన క్రీడాకారులకు డీఎస్సీలో అన్యాయం జరుగుతోందని చెప్పారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం తొలుత కేటగిరి – ఏ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మొదటి ప్రాధాన్యమిచ్చి, దాని తర్వాతే కేటగిరి – బీ లోని క్రీడాకారులను పరిశీలన తీసుకుంటామనే విషయం పేర్కొన్నారు. దీనివల్ల కేటగిరీ – బీ లోని క్రీడాకారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఉన్న విధంగా అంతర్జాతీయ స్థాయి, జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన వారికి ప్రాధాన్యత కల్పిస్తూ ఉద్యోగాలు భర్తీ చేయాలని ఆయన కోరారు.

వైషమ్యాలు తొలగాలి

కడప కల్చరల్ : వైషమ్యాలు నశించిపోవాలని బుద్దిస్ట్ సొసైటీ పక్షాన కృషి చేయనున్నట్లు ఇంటాక్ జాతీయ కౌన్సిల్ మెంబర్ లయన్ చిన్నప రెడ్డి అన్నారు. బుద్దిష్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం పాత రిమ్స్‌లో సొసైటీ అధ్యక్షులు విజయ కుమార స్వామి రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత బుద్ధుని విగ్రహానికి పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి, పిళ్లా విజయ కుమారస్వామి రెడ్డి మాట్లాడుతూ బుద్దిస్ట్ కల్చరల్ సొసైటీ ప్రతి ఏటా బుద్ధ పౌర్ణమి వేడుకలను వివిధ ప్రదేశాలలో నిర్వహిస్తోందన్నారు. కడప సిటిజన్ ఫోరం నాయకులు డాక్టర్ రాజా వెంగల్ లెడ్డి , బుద్దిస్ట్ కల్చరల్ సొసైటీ ఉపాధ్యక్షులు డాక్టర్ అశోక్ కుమార్, పిరమిడ్ సెంటర్ చీఫ్ అడ్వైజర్ ఓబయ్య, ప్రముఖ ఉపాశిక డాక్టర్ రాజేశ్వరమ్మ కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా మే మాసం ఇంటాక్ మాస పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి లెనిన్ ప్రసాద్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ రామ్ గోపాల్, డాక్టర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ, సమానత్వమే బౌద్ధ మతం సందేశం

కడప కార్పొరేషన్ : స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృమే బౌద్ధ మత సందేశమని అంబేద్కర్ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మొయిల్ల కాలువ రామయ్య అన్నారు. సోమవారం బుద్ధ పౌర్ణమి సందర్భంగా నగర శివార్లలో ఉన్న బుద్ధ టౌన్‌షిప్ లో ఉన్న బుద్ధ విహార వద్ద బౌద్ధ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర లీగల్ సెల్ ఛైర్మన్ అడ్వకేట్ వై రమేష్ బాబు, జిల్లా కో ఆర్డినేటర్ దర్శి రాజేష్, నేషనల్ హ్యూమన్ రైట్స్ యూత్ కన్వీనర్ వై సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : కార్మికుల కోసం పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో కేంద్రం తీసుకువచ్చే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా బాధ్యులు డబ్ల్యూ. రాము డిమాండ్ చేశారు. ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సోమవారం కడప నగరంలో ఐఎఫ్‌టీయు కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డబ్ల్యూ రాము మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మికులపై దాడి మొదలుపెట్టిందని మండిపడ్డారు. ఈ సమ్మెను కార్మికులు, కర్షకులు, ప్రజలు, ప్రజా సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నగర నాయకుడు నాగరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, పీవైఎల్ ఉమ్మడి జిల్లా నాయకుడు సెమీవుల్లా, పీవైఎల్ నగర నాయకుడు రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నాణేలు చరిత్రకు సాక్ష్యాలు

కడప కల్చరల్ : నాణేలు చరిత్రకు బలమైన సాక్ష్యాలుగా నిలిచాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ అన్నారు. ఈ మేరకు రాయలసీమలోని నాణేల సేకరణ గురించి విశేషమైన కృషి చేశారని అభినందించారు. సంఘం కార్యవర్గ సభ్యుడు రంగనాథ్ పర్యవేక్షణలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ ఈ మేరకు నాణేల ప్రదర్శన గురించి తెలియజేస్తూ వాటి గురించిన పూర్తి వివరాలకు బాలలు తెలుసుకునేలా చేశారు. ప్రపంచ దేశాల నాణేలు, నోట్లు వివిధ రాజుల కాలం నాటి పురాతన నాణేలతో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు అవసరమైన విజ్ఞానాన్ని పొందేందుకు క్రీస్తు పూర్వం నుంచి నేటి వరకు పలు అంశాల గురించి విశేషాలను తెలుసుకున్నారు. సుమారు 250 దేశాలకుపైగా నాణేలు, ప్రపంచ దేశాల నోట్ల ప్రదర్శన, మొదటి, రెండవ ప్రపంచ యుద్ధకాలం నాటి నోట్లు, వివిధ దేశాలలో ఉన్న ప్లాస్టిక్ నోట్లను ప్రదర్శనలో విద్యార్థులు వీక్షించారు.



పలు దేశాల నాణేలను పరిశీలిస్తున్న విద్యార్థులు

ఈ వేసవి శిక్షణా శిబిరంలో ఉపాధ్యాయుని పద్మలత, ఇమిటేషన్, ఇండోర్ గేమ్స్ మరో ఉపాధ్యాయుని భారతి ప్రత్యేక తరగతులు నిర్వహించారు. బుద్ధ పూర్ణిమ గురించి తెలుపడంతోపాటు గౌతముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన్ కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ నాదెండ్ల బాబ్జి పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలి



తాడిగొట్ల గ్రామస్తులతో అధికారులు, తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కడప అగ్రికల్చర్ : రైతులు వ్యవసాయ అభివృద్ధికి తగు సూచనలు సలహాలను ఇవ్వాలని ఊటుకూరు ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్ పేర్కొన్నారు. కడప ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో కడప నగర సమీపంలోని తాడిగొట్ల గ్రామంలో సోమవారం గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా తిరుపతి వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంకయ్య కుమార్ మాట్లాడుతూ గ్రామ రైతులు అందరూ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి గ్రామ అభివృద్ధికి కృషి చేయవలసిందిగా కోరారు. వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ వారం రోజులపాటు తాడిగొట్ల గ్రామంలో పలు కార్యక్రమాలను కళాశాల తరుపున నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా జంతువు ఆరోగ్య శిబిరం, గ్రామస్తులకు ఆరోగ్య శిబిరం, రైతు సదస్సు, ప్రదర్శన, స్వచ్ఛత సేవ ప్రచారం, వనమహోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించబోతున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ సాలమ్మ మాట్లాడుతూ ఈ పథకాన్ని గ్రామంలో నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అభ్యుదయ రైతు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలియజేశారు. తదనంతరం దేశం కోసం అసువులు బాసిన అమరవీరుడు మురళి నాయక్‌కు సభలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితుల స్థల వివాదానికి రాజకీయ రంగు పులమొద్దు

కడప కార్పొరేషన్ : నగర శివారుల్లోని ఇందిరానగర్ లో ఉంటున్న దళితుడు పల్లం చంద్రయ్య స్థల వివాదానికి రాజకీయ రంగు పులమడం దారుణమని దళిత ఫోరం కన్వీనర్ బూసిపాటి కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరానగర్ లోని నడివీధి గంగమ్మ దేవాలయం నిర్మించుకొని, ఆలయం పక్కనే టీ స్టాల్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్న పల్లం చంద్రయ్య అనే వ్యక్తిని అక్కడ నుంచి వెళ్లిపోవాలని అగ్రవర్ణాలకు చెందిన కొంతమంది బెదిరింపులకు పాల్పడుతున్నారన్న విషయమై సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ ఇందిరానగర్ లో పల్లం చంద్రయ్య నడివీధి గంగమ్మ దేవాలయం నిర్మించుకొని, ఆలయంలో ధూప దీప నైవేద్యం చేసుకుంటూ అమ్మవారికి సేవ చేసుకుంటున్నారన్నారు. భక్తుల నుంచి చందాలు వసూలు చేసి ఆలయాన్ని కూడా చంద్రయ్యే నిర్మించారన్నారు. అమ్మ వారి సేవతో పాటు అ పక్కనే ఉన్న స్థలంలో టీ దుకాణం పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నానన్నారు. ఆలయాన్ని నిర్మించిన నాటి నుంచి టీ దుకాణం ఉన్నా ఎన్నడు ఎవరికి అడ్డం కాలేదని, ఎవరికి అభ్యంతరాలు వ్యక్తం కాలేదన్నారు. కానీ ఇటీవల ఇందిరా నగర్ లోకి వచ్చిన కొంతమంది వ్యక్తులు ఎలాగైనా చంద్రయ్య టీ దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించాలని కుట్ర పన్నుతున్నారని వివరించారు. ఈ సమస్యలో పల్లం చంద్రయ్యను ఇబ్బందులపాలు చేస్తే వారికి తగిన గుణపాఠం చెప్పేందుకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో బాధితుడు పల్లం చంద్రయ్య, షమాల మహానాడు నాయకులు మోహన్, శ్యాంసన్, ఎమ్మార్పీఎస్ నాయకులు బాబురావు నరసింహులు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇరువురిపై కత్తితో దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి బిల్డప్ సర్కిల్ సమీపంలో ఏఎస్‌ఆర్ నగర్‌కు చెందిన వరుణ్ తేజ (24), బాబావల్లి (22) అనే ఇద్దరిని ఆంజనేయులు, అతని కుమారుడు జ్ఞానేశ్వర్‌లు కత్తితో దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనలో కత్తి పోట్లను బలంగా ఎదుర్కొన్న వరుణ్‌తేజకు వీపుపై మూడు చోట్ల కత్తిపోట్లు కావడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్స పొందుతున్నాడు. అతని స్నేహితుడు బాబావల్లి గాయపడ్డారు. ఈ సంఘటనపై ఎస్ఐ తులసీనాగప్రసాద్ వివరాలను తెలియజేశారు. ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన వరుణ్‌తేజ, బాబావల్లిలు లోహియానగర్‌కు చెందిన ఆంజనేయులు తన ఎదుటనే తన కుమారుడు ధర్మేంద్రపై అనవసరంగా దాడి చేశారనే ఆగ్రహంతో తన దగ్గరున్న కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో తన తండ్రితో పాటు మరో కుమారుడు జ్ఞానేశ్వర్ కూడా పాలుపంచుకున్నాడు. తండ్రి, కుమారుడిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈక్రమంలో ఈ కేసులో నిందితులు ఇరువురిని సీఐ టి.రెడ్డెప్ప ఆదేశాల మేరకు ఎస్ఐ తులసీనాగప్రసాద్ తమ సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి లోహియానగర్‌లో అరెస్ట్ చేశారు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వరుణ్‌తేజ

నర్సుల సేవలు విలువైనవి

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ ఆవరణంలోని ఐఎంహెచ్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే 12న జరుపుకుంటామన్నారు. నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినోత్సవ సందర్భంగా నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. నర్సులు చేస్తున్న కృషి విలువైనదని, రోగులను 24 గంటలూ జాగ్రత్తగా చూసుకుంటున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలపాలన్నారు.



నర్సుల దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న డాక్టర్స్, నర్సులు

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గ్రేడ్–1నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ మాట్లాడారు. తరువాత ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్ర పటానికి పూలదండ వేసి అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డిని శాలువాతో సత్కరించారు.

ఘనంగా అన్నమాచార్యుడి జయంతి ఉత్సవం

కడప కల్చరల్ : పద కవితా పితామహులు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలను కడప నగరంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పిడతల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోగల అన్నమాచార్యుల విగ్రహానికి విశేష వస్త్రం, పూలమాలలు అలంకరించారు. అనంతరం మున్సిపల్ మెయిన్‌హైస్కూలు సర్కిల్‌లోగల అన్నమాచార్య పెద్ద విగ్రహానికి విశేష పూజలు చేసి, పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఇక్కడ కూడా విగ్రహానికి నూతన వస్త్రాలను అలంకరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇందులో భాగంగా అన్నమాచార్యుల సేవా ట్రస్ట్ ప్రతినిధి బిట్రా పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్యుల ఆలయ పునర్నిర్మాణ కమిటీ కీర్తలను ఆలపించి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి, అనిత, రమారాణి, సంగీత గురువు వెంకటేశ్వరరావు శిష్య బృందాలు కలిసి ఘనంగా సంకీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో స్థానిక భక్త బృందాలు బండారు శివకేశవ, మస్తాన్‌రావు, కె.సుబ్బారెడ్డి. బీజేపీ నాయకులు బాలకృష్ణ యాదవ్, కళ్యాణ్. కృష్ణారెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు రామ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అన్నమాచార్యుల భారీ విగ్రహం వద్ద భక్త బృందం